## వేలం పాటలో ..లడ్డూను దక్కించుకున్నవారు



మెహిదీపట్నం: లంగర్‌హౌస్ హరిదాస్ పురాలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో వేలం పాటలో పాడిన లడ్డూను రూ. 4 లక్షల 21 వేలకు బోగి శివ,బోగి భరత్,భోగికిరణ్ టీమ్ సొంతం చేసుకున్నారు.



మెహిదీపట్నం: లంగర్‌హౌస్ గాంధీనగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద పాడిన లడ్డూ వేలం పాటలో బీఆర్ఎస్ నాయకులు,బస్తీ అధ్యక్షులు సత్యనారాయణ రూ.52వేలకు దక్కించుకున్నారు.



సీతారాంబాగ్‌లో శ్రీగణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లడ్డూను సంజు కుమార్ రూ. 21,111 వేలకు సొంతం చేసుకున్నారు.– మెహిదీపట్నం సెప్టెంబర్ 18



అబిడ్స్: నాంపల్లి ఓంనగర్‌లోని నేతాజీ అసోసియేషన్ వినాయక మండపం లడ్డూను కోదాటి కిశోర్ కుమార్, శివ బ్రదర్స్ వేలం పాటలో రూ.90 వేలకు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు శేఖర్, లడ్డు, సన్ని, నవీన్‌లు సన్మానించారు.



అబిడ్స్: జియాగూడ ఇమాంపురాలో నవ భారత సంఘం అధ్యక్షుడు మదిర సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం లడ్డూ వేలం పాటలో సభ్యులు చాట్ల సురేష్‌కుమార్ రూ.60 వేల 500 లకు దక్కించుకున్నారు.



కాచిగూడ: గోల్నాక ఖర్కానలైన్ శ్రీ సిద్ధి వినాయక అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూ వేలంలో గోల్నాక వాసి ఎం.అంబాదాస్, హేమలత దంపతులు రూ.69 వేలకు దక్కించుకున్నారు.ఈ కార్యక్రమంలో లావణ్య,విష్ణువర్ధన్,శ్రీ సిద్ధివినాయక అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



నాంపల్లి గాంధీభవన్ పటేల్‌నగర్‌లోని సాయికృపా అపార్ట్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన మహా గణపతి లడ్డూను వేలం పాటలో లక్ష్మణ్ బ్రదర్ రూ. 51 వేలకు దక్కించుకున్నారు. అసోసియేషన్ సభ్యులు నరసింహ, పాల్, ప్రేమ్‌కుమార్, మల్లేష్, కిశోర్, వరుణ్, నరేష్, యశ్వంత్, గిరీష్, ఆకాష్, పదంలు వారికి అభినందనలు తెలిపారు. –అబిడ్స్

## నేడు బొమ్మ మహేశ్‌గౌడ్‌కు సన్మానం

చిక్కడపల్లి,సెప్టెంబర్18 : నూతన టీ పీసీసీ అధ్యక్షుడిగా ఎన్నికైన బొమ్మ మహేశ్‌గౌడ్‌కు గురువారం రవీంద్రభారతిలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలంగాణ గౌడ కల్లుగీత సమన్వయ కమిటీ నాయకులు తెలిపారు. బుధవారం చిక్కడపల్లిలోని సమన్వయ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిటీ చైర్మన్ బాలగౌని బాల్‌రాజ్ గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్, వర్కింగ్ చైర్మన్ ఎలికట్టే విజయ్‌కుమార్ గౌడ్‌లు మాట్లాడుతూ మాజీ ఓబీసీ ఎంపీల ఫోరం కన్వీనర్ వి.హనుమంత రావు ఆధ్వర్యంలో జరిగే ఈ సన్మాన సభను విజయవంతం చేయాలని కోరారు.

# అర్హులు ఓటు నమోదు చేసుకోవాలి


- ఓటరు జాబితా సవరణను సద్వినియోగం చేసుకోవాలి
- తప్పొప్పులను సరిదిద్దుకునే అవకాశం
- అంబర్‌పేట డీసీ మారుతీ దివాకర్



మారుతీ దివాకర్, డీసీ, అంబర్‌పేట

అంబర్‌పేట, సెప్టెంబర్ 18 : ప్రత్యేక ఓటరు జాబితా సవరణను అంతా సద్వినియోగం చేసుకోవాలని అంబర్‌పేట సర్కిల్ డీసీ మారుతీ దివాకర్ అన్నారు. ఇప్పటికే బూత్ లెవెల్ ఆఫీసర్లు(బీఎల్‌ఓ)లు ఇంటింటికీ తిరిగి ఓటరు జాబితాను పరిశీస్తున్నారని చెప్పారు. అంబర్‌పేట నియోజకవర్గంలో 236 పోలింగ్ బూత్‌లలో ఈ సవరణ కార్యక్రమం జరుగుతున్నదని తెలిపారు. ఒక్కో బూత్‌కు ఒక్కరు రోజుకు 50 ఇండ్లకు వెళ్లి ఓటరు జాబితాను పరిశీలిస్తున్నారన్నారు. ఎస్ఎఫ్ఏలు, ఆర్‌పీలు, అంగన్‌వాడీ, ఆశవర్కర్లు, జీహెచ్ఎంసీ సిబ్బందిని ఇందుకు వినియోగిస్తున్నామని తెలిపారు. ఓటరు జాబితాలో పేర్లు తప్పుగా ఉంటే సరిచేసుకోవాలన్నారు. చిరునామా మారినా కొత్త చిరునామాను కూడా నమోదు చేసుకోవచ్చన్నారు. 2025 జనవరి నాటికి 18 ఏండ్లు నిండినవారు ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

అలాగే ఈ సవరణలో డబుల్ ఓట్లు ఉన్నా, పూర్తిగా ఇంకో చోటకు షిఫ్ట్(మారినా) వారి పేర్లను తొలగిస్తామన్నారు. స్పెషల్ సమ్మరి రివిజన్–25ను ఓటర్లు వినియోగించుకోవాలని కోరారు. అక్టోబర్ 18 వరకు ఈ అవకాశం ఉంటుందన్నారు.



### కనుల పండుగగా ఉమామహేశ్వర కల్యాణం

ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని శ్రీలక్ష్మీ గణపతి దేవాలయంలో బుధవారం ఉమామహేశ్వర కల్యాణం కనుల పండుగగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమాలను కార్యనిర్వాహణాధికారి పాశం లక్ష్మారెడ్డి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో దేవాలయం మాజీ చైర్మన్ బీఎన్ శ్రీనివాస్ యాదవ్, ముఖ్య అర్చకుడు కాశీనాథ్ శర్మ,అర్చకులు, భక్త బృందం సభ్యులు గజానంద్ తదితరులు పాల్గొన్నారు. – చిక్కడపల్లి

### నేటి నుంచి రెండు రోజుల పాటు సదస్సు

వ్యవసాయ యూనివర్సిటీ : ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫ్ ఇండియా(పీపీఓఐ) ఆధ్వర్యంలో రెండు రోజులపాటు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు శరత్‌బాబు, డాక్టర్ జగదీశ్వర్ తెలిపారు. రాజేంద్రనగర్ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో గురు, శుక్రవారాల్లో రెండురోజుల పాటు సదస్సు నిర్వహించనున్నారు. బ్రెయిన్ స్టోర్మింగ్, సేంద్రీయ ఎరువులు, బయోకెమికల్స్, ఫార్మింగ్, విత్తన పరిశోధన, పరిశీలన, పురుగుమందుల యాజమాన్యం తదితర అంశాలపై సీనియర్ శాస్త్రవేత్తలు పాల్గొని చర్చించనున్నట్లు పేర్కొన్నారు.



ప్రముఖ రచయిత్రి డాక్టర్ వాడ్రేవు వీరలక్ష్మీదేవిని సత్కరిస్తున్న ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, చెన్నయ్య తదితరులు

### సామాజిక ప్రయోజనం కలిగేలా..

# రచనలు ఉండాలి

**ప్రముఖ రచయిత్రి, విమర్శకురాలు డాక్టర్ వాడ్రేవు వీరలక్ష్మీదేవి**

తెలుగు యూనివర్సిటీ, సెప్టెంబర్ 18: సాహిత్యం ఆనందం కలిగించడంతో పాటు సామాజిక ప్రయోజనాన్ని కలిగించేలా ఉండాలని ప్రముఖ రచయిత్రి, విమర్శకురాలు డాక్టర్ వాడ్రేవు వీరలక్ష్మీదేవి అన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పరిణతవాణి ప్రసంగాల పరంపరలో భాగంగా బుధవారం సాయంత్రం ప్రముఖ రచయిత్రి డాక్టర్ వాడ్రేవు వీరలక్ష్మీదేవి తన జీవితం, సాహిత్య కృషిని ప్రసంగంలో వివరించారు. చిన్నప్పటి నుంచి తన తండ్రి చెప్పిన కథలు, గురువుల ప్రేరణ, చదివిన పుస్తకాలు సాహిత్య అధ్యయనంతోనే సాహితీవేత్తగా మారానని అన్నారు. అసమానతలు నెలకొన్న సమాజాన్ని సంస్కరించడానికి సాహతీయ కృషి చేయాలని ఆకాంక్షించారు. మంచి రచయితలుగా ఎదగడానికి సాహిత్య అధ్యయనం ముఖ్యమని సూచించారు.

తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి ప్రసంగిస్తూ పరిణతవాణి ప్రసంగాలను పుస్తకరూపంలోకి తీసుకొచ్చి భావితరాలు స్ఫూర్తిపొందేలా పరిషత్తు కృషి చేస్తుందన్నారు. 110మంది ప్రసంగాల పుస్తకాలు తెలుగు భాషా సాహిత్యాల గొప్పదనాన్ని చాటిచెబుతున్నాయని పేర్కొన్నారు. పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె. చెన్నయ్య ప్రసంగిస్తూ కథ, నవల, సాహిత్య, విమర్శ, అనువాదం తదితర ప్రక్రియలలో వీరలక్ష్మీదేవి అద్భుతమైన రచనలు సాగించారని వివరించారు. పరిషత్తు ప్రాచ్య కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ ఏ.సిల్మానాయక్ సమన్వయకర్తగా వ్యవహరించారు.

## మేదరి కార్మికులకు పెన్షన్ ఇవ్వాలి



మాట్లాడుతున్న వర్కింగ్ ప్రెసిడెంట్ బాబు, సలహాదారుడు మురళీకృష్ణ తదితరులు

కాచిగూడ,సెప్టెంబర్ 18: యాభై ఏండ్లు దాటిన మేదరి కార్మికులకు ప్రభుత్వం పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని మేదరి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బాబు, ఫెడరేషన్ సలహాదారుడు మురళీకృష్ణ విజ్ఞప్తి చేశారు. ప్రపంచ వెదురు దినోత్సవాన్ని బుధవారం బర్కత్‌పుర కార్యాలయంలో నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం మేదరి కార్మికులకు ఉచితంగా వెదురును సరఫరా చేయాలని కోరారు. అన్ని రంగా ల్లో వెనుకబడిన మేదరుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో పి.యాదగిరి,జి.శ్రీధర్, అంజ య్య,మహేశ్, వెంకటేశ్, నర్సింహ, శేఖర్, చెన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

## వరద సమస్యలు పరిష్కరించాలి



శాంతం చెరువు సమీపంలో ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిసరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్ మోహినుద్దీన్

మెహదీపట్నం, సెప్టెంబర్ 18 :నియోజకవర్గంలోశాంతం చెరువులోకి చేరే వరద నీరు సాఫీగా వెళ్లే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కార్వన్ ఎమ్మెల్యే కౌసర్ మోహినుద్దీన్ ఇరిగేషన్ అధికారులకు సూచించారు. బుధవారం ఆయన ఇరిగేషన్ అధికారులతో కలిసి శాంతం చెరువు పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల సమయంలో వరద నీరు సాఫీగా వెళ్లక పోవడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్న విషయాన్ని ఆయన అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. స్థానికుల సమస్యలను పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

### రూ.2.35లక్షల విరాళం

హిమాయత్‌నగర్, సెప్టెంబర్ 18: ఆంధ్రప్రదేశ్ వరద బాధితుల సహాయార్థం హైకోర్టు సీనియర్ న్యాయవాది ముత్తినేని కోటేశ్వర్‌రావు, సునీత దంపతులు బుధవారం సీఎం సహాయనిధికి రూ.2,35,000 విరాళం అందజేశారు. చెక్కును ఏపీలోని ఉండవల్లిలో మంత్రి నారా లోకేశ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకునేందుకు దాతలు, సంస్థలు విరాళాలు అందజేయాలని కోరారు.

## దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రత్యేక పాలసీ తేవాలి

చిక్కడపల్లి, సెప్టెంబర్ 18 : దివ్యాంగుల సంక్షేమం,అభివృద్ధి కోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక పాలసీ ప్రకటించాలని ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.వెంకట్, ఎం.అడివయ్యలు డిమాండ్ చేశారు. చిక్కడపల్లిలోని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ)రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. దివ్యాంగులపై సమాజంలో వివక్షత కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దివ్యాంగుల కోసం ఉన్న చట్టాలు సక్రమంగా అమలు కావడం లేదన్నారు. విద్య, ఉపాధి అవకాశాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదురుకుంటున్నారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎన్‌పీఆర్‌డీ నాయకులు ఆర్.వెంకటేష్, జె.రాజు, బి.స్వామి, ఉపేందర్, గణేశ్, ఏ.లింగన్న, వెంకన్న, భుజంగారెడ్డి, ప్రకాశ్, చందు, శశికళ, నగేశ్, లలిత తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు కే.వెంకట్

### కేసీఆర్ కృషితోనే..

## జిల్లాకో వైద్య కళాశాల



విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ముఠా జయసింహ

చిక్కడపల్లి, సెప్టెంబర్18 : దేశంలో మరెక్కడా లేని విధంగా, కొత్త జిల్లాలను పరిగణలోకి తీసుకొని జిల్లాకో వైద్య కళాశాలను మంజూరు చేసిన ఘనత తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌దే అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ముఠా జయసింహ అన్నారు. బుధవారం గాంధీనగర్‌లో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు ముందు తెలంగాణ ప్రాంతంలో కేవలం 5 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు మాత్రమే ఉండేవన్నారు.ఉమ్మడి రాష్ట్రంలో వైద్యం, విద్యలో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని గుర్తించిన కేసీఆర్ కేంద్రం ఏమాత్రం సహకరించకున్నా రాష్ట్ర ప్రభుత్వ ఖర్చుతో జిల్లాలో మెడికల్ కళాశాలనను ఏర్పాటు చేశారని వివరించారు.



### వినోద్‌కుమార్ సేవలు చిరస్మరణీయం

ఎల్ఐసీ ఆఫ్ ఇండియా సీ.బీ–2(ఎండీఆర్‌టీ)సభ్యుడు, సంఘ సేవకుడు మంత్రి వినోద్‌కుమార్(59)సమాజానికి అందించిన సేవలు చిరస్మరణీయం అని బీఆర్ఎస్ నగర నాయకుడు పులిజాల గెల్వయ్య అన్నారు. అంబర్‌పేట జైస్వాల్ గార్డెన్‌కు చెందిన వినోద్‌కుమార్ ప్రథమ వర్ధంతి సభను బుధవారం నిర్వహించారు. అనంతరం బీఆర్ఎస్ నాయకుడు గెల్వయ్య, జైస్వాల్ గార్డెన్ శ్రీశ్రీ మైసమ్మ దేవాలయ కమిటీ అధ్యక్షుడు నూనెముంతల రమేశ్‌గౌడ్,అతికం శ్రీనివాస్‌గౌడ్, పడకంటి అంజయ్యచారి, వెంకటేశ్‌గౌడ్,శివకుమార్‌తో పాటు జైస్వాల్ గార్డెన్ కాలనీ వాసులు వినోద్‌కుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భార్య మంత్రి నాగలక్ష్మి, కుమారుడు సాయి విశ్వాస్, దుద్యాల వినోద్‌కుమార్,వెంకటేశ్, రవి,అనిల్, గాయత్రి,లత, వినిత,బెంజిమెన్, జగదీశ్,ఎల్ఐసీ సభ్యులు పాల్గొన్నారు. – కాచిగూడ,సెప్టెంబర్ 18



నిమజ్జనంలో.. జాలి హనుమాన్ పోలీస్ క్వార్టర్స్‌లో ఎస్ఎస్‌కే మహిళా మండలి వినాయక ప్రతిమ నిమజ్జనోత్సవంలో పాల్గొన్న గీతా గోంగ్లె, సంయుక్త గోంగ్లె, దర్శిత, హరినాక్షిలు. –అబిడ్స్, సెప్టెంబర్ 18

## చాకలి ఐలమ్మ వారసులను ఆదుకోవాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డీజీ నరసింహారావు

ఖైరతాబాద్, సెప్టెంబర్ 18 : వీరనారి చాకలి ఐలమ్మ వారసులు, కుటుంబసభ్యులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డీజీ నరసింహారావు కోరారు. తెలంగాణ తల్లి ఐలమ్మ ఫౌండేషన్ ఆవిర్భావ సభ బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన నరసింహారావు, ఐలమ్మ వారసురాలు చిట్యాల మంజులతో కలిసి మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఐలమ్మ ధీరత్వం వెలకట్టలేనిదన్నారు. తెలంగాణ మహిళా శక్తికి ధైర్యసాహసాలకు ప్రతీకగా నిలిచిన ఐలమ్మను తెలంగాణ తల్లిగా గుర్తించాలన్నారు. జనగామ జిల్లాకు ఆమె పేరు పెట్టాలని, ట్యాంక్‌బండ్‌పై ఐలమ్మ విగ్రహాన్ని ప్రతిష్టించాలని, హైదరాబాద్‌లో స్మారక భవనాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు. ఐలమ్మ చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలన్నారు. ఐలమ్మ వారసులు, కుటుంబ సభ్యులను ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. ఆమె కుటుంబంలో వృత్తిని నమ్ముకున్న వారికి ఉపాధి అవకాశాలు, విద్యావంతులకు ఉద్యోగ అవకాశాలను కల్పించాలని కోరారు.

అనంతరం ఫౌండేషన్ నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా చిట్యాల యాకయ్య, చిట్యాల మంజుల, ఉపాధ్యక్షులుగా జంపయ్య, కొమురయ్య, భాగ్య, సంధ్యారాణి, కృష్ణ, సంయుక్త కార్యదర్శులుగా భవాని, రమేశ్, కోశాధికారిగా రాజును ఎన్నుకున్నారు. సమావేశంలో సీపీఐ ఎంఎల్ రాష్ట్ర నేతలు రమ, సైదయ్య, ఎంసీపీఐయూ నేత రవి తదితరులు పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

మెహిదీపట్నం/ సెప్టెంబర్ 18 ( నమస్తే తెలంగాణ ) : అనుమానా స్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన హబీబ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాంపల్లి ఏ బ్యాటరీలైన్‌లో నివసించే ఖాజా నిమాముద్దీన్ అలియాద్ ఖలేత్ లకీకాపూల్ ప్రగతి ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేస్తుండేవాడు. మల్లెపల్లి కుర్మ బస్తీలో ఉండే ఓ మహిళతో అక్రమసంబంధం ఉంది. బుధవారం ఉదయం ఆమె ఇంటికొచ్చిన అతడు అపస్మారక స్థితిలో కిందపడిపోయాడు. కొద్దిసేపయ్యాక లేచి వెళ్లిపోతాడనుకుని ఆ మహిళా అక్కడి నుంచి వెళ్లిపోయింది. మధ్యా హ్నం స్థానికులు గమనించి అతడు చనిపోయినట్టు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్ట నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

### ఉచిత శిక్షణ..

## ఉపాధి కల్పన

**ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలి**

అంబర్‌పేట, సెప్టెంబర్ 18: బెత్లాహం పారామెడికల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు పలు కోర్సులలో ఉచితంగా శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి కల్పిస్తున్నట్లు డైరెక్టర్ ప్రసన్నకుమార్ తెలిపారు. జనరల్ డ్యూటీ అసిస్టెంట్, మెడికల్ టెర్మినాలజీ, హూమన్ అనాటోమీ అండ్ సోసియోలజీ, పేషంట్ కేర్ సర్వీస్, ల్యాబ్ డెమోన్‌స్ట్రేషన్, ఫస్ట్ ఎయిడ్, బేసిక్ ఐటీ స్కిల్స్, ఎంఎస్ ఆఫీస్, ఇంగ్లిష్ టైపింగ్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్ అండ్ ఇంటర్వ్యూ స్కిల్స్, ఇంటర్‌నెట్ కాంసెప్ట్ వంటి అంశాలలో ఆరు నెలల శిక్షణ ఇచ్చి అనంతరం వారికి ఉపాధి కల్పిస్తామన్నారు. పదో తరగతి పాస్ లేదా ఇంటర్ పాస్/ఫెయిల్ అయిన వారు 21 ఏండ్ల లోపు వయసు ఉన్నవారు అర్హులన్నారు. పదో తరగతి మెమో, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు దరఖాస్తుకు జతపరిచి నల్లకుంట ఫీవర్ హాస్పిటల్ చౌరస్తాలో గల బెత్లాహం పారామెడికల్ ఫౌండేషన్ కార్యాలయంలో అంద జేయాలన్నారు. సెల్:9866 181010, 9848073735లలో సంప్రదించాలని కోరారు.

### వేర్వేరు రైళ్లల్లో దొంగతనాలు

కాచిగూడ,సెప్టెంబర్ 18: కర్నూల్ రైల్లో ప్రయాణిస్తున్న ప్రయాణికురాలి బంగా రు ఆభరణాలను గుర్తు తెలియని వ్యక్తు లు దొంగిలించారు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం బేగంబజార్‌కు చెందిన దీపక్‌శర్మ భార్య మమతశర్మ(52)కర్నూల్ రైల్లో కాచిగూడకు వస్తుండగా మార్గమధ్య ధర్మాబాద్‌లో బ్యాగు చూసుకునేసరికి అందులో ఉన్న 35 గ్రాముల బంగారు ఆభరణాలను దొంగిలించారు.బుధవార ం కాచిగూడ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని తదుపరి విచారణ నిమిత్తం నాందేడ్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు తెలిపారు.

**మధురై స్పెషల్ రైల్లో...**

మధురై స్పెషల్ రైల్లో ప్రయాణికురాలి ఖరీదైన సెల్‌ఫోన్లు మాయమయ్యాయి. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం గుజరాత్‌లోని అహ్మదాబాద్ ప్రాంతానికి చెందిన జితేందర్ కుమార్ భార్య జైన్‌బబిత(38)మధురై స్పెషల్ రైల్లో కాచిగూడకు వస్తుండగా ఇంగోలి సమీపంలో బ్యాగులో ఉన్న 2 సెల్‌ఫోన్లు, వాచ్‌లు, కార్డులను దొంగిలించారు. బుధవారం బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని తదుపరి విచారణ నిమిత్తం నాందేడ్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు తెలిపారు.

### పటాకులు పేలి పలువురికి గాయాలు

చార్మినార్, సెప్టెంబర్ 18 : గుట్టుచప్పుడు కాకుండా నిల్వ చేసిన పటాకులు పేలి పలువురు గాయాలపాలైన ఘటన బహదూర్‌పుర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కిషన్‌బాగ్‌లో ఓ వ్యక్తి దీపావళి పటాకులను అధిక మోతాదులో ఇంట్లో నిల్వచేసి భద్రపర్చాడు. బుధవారం ఆ ఇంట్లో ఒక్కసారిగా పేలుడు చోటు చేసుకోవడంతో ఇంటి పైకప్పులు ఎగిసి పడ్డాయని తెలిపారు. ఈ ఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు. స్థానికుల సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన క్షతగాత్రులను మెరుగైన చికిత్సను అందించేందుకు పోలీసులు ఆసుపత్రికి తరలించారు. పేలుడుకు సంబంధించిన వివరాలను సేకరిస్తున్నామని పోలీసులు తెలిపారు.